
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
మంగళవారం 31 డిసెంబరు 2024



విజన్ ఉన్న నాయకుడు మన్మోహన్‌సింగ్

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు పది వేల కోట్లు మాఫీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నాయకుడు మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మన్మోహన్ సింగ్ గురించి ఆయన మాట్లాడుతూ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి పది వేల కోట్ల రుణ మాఫీ చేయాలని కోరగా మాఫీ చేశారన్నారు. ఆయన కృషి వల్లనే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునః ప్రారంభం అయిందని, 5 వేల మందికి ఉపాధి లభించిందని తెలిపారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పత్తి నిల్వలు ఉన్నందున సీసీఐ అధికారి డీకే నాయక్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి 3 వరకు చెన్నూరులోని సీసీఐ పత్తికొనుగోళ్లు తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు ప్రకటనలో తెలిపారు. అలాగే 4, 5తేదీల్లో సాధారణ సెలవులు ఉన్నందున తిరిగి జనవరి 6 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం రేపల్లెవాడలోని జిన్నింగు మిల్లులో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించాలని కోరారు.

ఆరోగ్యం అందని భాగ్యమే
● వేధిస్తున్న సిబ్బంది కొరత
● ఆదివాసీలను వెంటాడిన అంటువ్యాధులు.. రక్తహీనత
4



తెగిపోయిన కమలాపూర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ

కాలువలకు గండ్లు.. **పూడ్చేదెప్పుడు...?** 5

హస్తం హవా

● అసెంబ్లీ, పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కైవసం
● మంచిర్యాలలో మూడో స్థానానికి బీఆర్ఎస్ గ్రాఫ్
● అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ



కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (మంచిర్యాల)



గడ్డం వివేక్ వెంకటస్వామి (చెన్నూర్)




గడ్డం వినోద్ వెంకటస్వామి (బెల్లంపల్లి)



వెడ్మ బొజ్జు (ఖానాపూర్)



గడ్డం వంశీకృష్ణ (పెద్దపల్లి ఎంపీ)



మంచిర్యాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్ 3న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ ఏడాది కొత్త రాజకీయాలకు తెర తీశాయి. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. మూడు నియోజకవర్గాల్లో పదేళ్ళ పాలన సాగించిన బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికలు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. మూడు చోట్లా ఆ పార్టీ అభ్యర్థులు పరాజయాన్ని చవిచూశారు. చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్యలు పోరాడి ఓడారు. ఆ రెండు చోట్లా ద్వితీయ స్థానంలో నిలిచారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఆపార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. బీఆర్ఎస్ మంచిర్యాల అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు ఊహించని విధంగా మూడో స్థానానికి పడిపోయారు. ఇక్కడ మొదటి స్థానంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ ఊహించని విధంగా రెండో స్థానానికి చేరుకున్నారు.

దోబూచులాడుతున్న మంత్రి పదవి..

అసెంబ్లీ ఎన్నికలు జరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడ్డ కొత్తలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవుల కేటా ం ుుం ఫు ఉం టుంద ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో మంత్రి పదవి రేసులో ఉన్న జిల్లాలోని ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్ రావు, గడ్డం వివేకానంద, గడ్డం వినోద్‌లు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచినా రెండో విడత మంత్రివర్గ విస్తరణకు మోక్షం లభించడం లేదు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితులను ఎదుర్కోగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం సజీవంగా ఉంది. ప్రస్తుత మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పదేళ్ళుగా ఒంటి చేత్తో పార్టీని నడిపిస్తూ వచ్చారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి బాధ్య తలు స్వీకరించిన అనంతరం కాంగ్రెస్‌కు ఊపు రాగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించింది. ప్రేంసాగర్‌రావు 2007-13 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీగా పని చేయగా, 2018లో మంచిర్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. పదేళ్లపాటు పార్టీని సజీవంగా ఉంచిన ఆయనకే ఈసారి మంత్రి పదవి దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తు న్నాయి.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దివంగత కాకా వెంకటస్వామి తనయులైన బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లు సైతం మంత్రి పదవి రేసులో ఉన్నారు. గడ్డం వినోద్ 2004లో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికకాగా 2009 వరకు ఐదేళ్లపాటు కార్మికశాఖ మంత్రిగా పని చేశారు. 2018 ఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి బీఎస్పీ టికెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2023లో బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఒక పర్యాయం మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఈ సారి ఆయనకే మంత్రి పదవి వస్తుందని కార్యకర్తలు విశ్వసిస్తున్నారు.



ఇక చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద్ 2009-14 వరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించారు. తిరిగి 2014లో పెద్దపల్లి పార్లమెంటు నుంచి బీఆర్ఎస్ తరుపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2023లో మొదటి సారిగా ఎమ్మెల్యే బరిలో నిలిచిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే ఖానాపూర్ నియోజక వర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన వెడ్మ బొజ్జు సైతం మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ గిరిజన జిల్లాగా పేరుండటంతో ఆదే సామాజిక వర్గానికి చెందిన బొజ్జుకు పదవి దక్కుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మిగతా 5వ పేజీలో

పార్లమెంట్ ఎన్నికల్లోనూ...

అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగించింది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద కుమారుడు వంశీకృష్ణను రంగంలోకి దింపింది. నామినేషన్ వేసినప్పటి నుంచే వంశీకృష్ణ పెద్దపల్లి పీఠంపై జెండా ఎగుర వేస్తారనే ప్రచారం జరిగింది. మే 13న లోక్‌సభ ఎన్నికలు జరుగగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఆ ఎన్నిక ల్లో గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీని అందుకోగా రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌లు నిలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున జిల్లాలోని మూడు నియోజక వర్గాల ఎమ్మెల్యేలు తమ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు కృషి చేశారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మొత్తం 42 మంది నామినేషన్లు దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల బరిలో తొలిసారిగా నిలిచిన గడ్డం వంశీకృష్ణ విజయదుందుభి మోగించారు.

సీఎం కప్ హ్యాండ్‌బాల్‌లో బంగారు పతకం

జిల్లా జట్టుకు ఘన స్వాగతం



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ సభ్యులు

గర్మిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టుకు సోమవారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 27 నుంచి 29 వరకు హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కోచ్ అరవింద్‌ను, క్రీడాకా రులను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ట్రెజరర్ రమేష్ రెడ్డిలు స్వాగతం పలికి సన్మానించారు. డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీరు, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, రమేష్, పనిరాజా, రామయ్య, కళ్యాణ్, సాయి, శృతి, వర్ష, తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ రూపంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



బుర్రకథతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజుకు చేరుకుంది. బుర్రకథను చెబుతూ ఉద్యోగులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. తాము చేస్తున్న విద్యావిధానంలో సేవా కార్యక్రమాలు, అదే విధంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ బుర్ర కథ రూపంలో వివరించారు. శిబిరాన్ని సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు రంగు రాజేశం, నాయకులు మధుసూదన్ రావు, కనుకుంట్ల మల్లన్న తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. తమ సమస్యల సాధనకు ఆందోళనను ఉధృతం చేస్తామని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు తెలిపారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఐబీ చౌరస్తాలో సోమవారం వామపక్ష పార్టీల నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు లాల్‌కుమార్, సంకె రవిలు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై దేశంలో రాజ్యాంగానికి, ప్రజలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. అమిత్‌షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేవరాజ్, లక్ష్మీకాంతం, శ్రీనివాస్, చాంద్‌పాషా, బ్రహ్మానందం, మంగ, తిరుపతి, శ్రీకాంత్, చరణ్, అరుణ, ప్రకాష్, రంజిత్ , మోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు సర్వాయిపేట విద్యార్థిని

రాష్ట్రపతితో తేనేటి విందులో పాల్గొనే అవకాశం



రుచితను సన్మానిస్తున్న శాతావాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్

కోటపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయిపేట గ్రామా నికి చెందిన గుగ్లోత్ రుచిత జనవరి 26న ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలకు ఎంపికైంది. కోటపల్లి మోడల్‌స్కూల్, కళాశాలలో ఇంటర్ వరకు చదువుకున్న రుచిత ప్రస్తుతం శాతావాహన విశ్వవిద్యాలయం పరిధిలోని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. విద్యార్థిని ఎన్ఎస్ఎస్ వాలంటరీగా అనేక క్యాంపుల్లో పాల్గొనగా ఎర్రకోటలో నిర్వహించే పరేడ్‌కు రాష్ట్రం నుంచి 8 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపిక కాగా శాతావాహన యూనివర్సిటీ నుంచి గుగ్లోత్ రుచిత ఎంపిక య్యారు. రుచిత ఎంపికపై శాతావాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ విద్యార్థిని అభినందించారు. రిపబ్లిక్ డే వేడుకల అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగే తేనేటి విందులో పాల్గొననుంది. మారుమూల గ్రామా నికి చెందిన గుగ్లోత్ దేశ్యానాయక్-లలిత రైతు కుటుంబానికి చెందిన గిరిజన బిడ్డ ఎంపిక కావడంపై గ్రామస్థులు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

న్యూ ఇయర్ వేడుకలకు తగ్గేదేలే

సిద్ధమవుతున్న యువత, ప్రజలు
హోటళ్ళు, ఫాంహౌస్‌లు బుకింగ్

బెల్లంపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేడుకల కోసం పలు ఏర్పాట్లను చేసుకున్నారు. స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల మధ్య ఎవరి స్థాయిలో వారు వేడుకలను నిర్వహించుకునేందుకు గెస్ట్ హౌజ్‌లు, లాడ్జిలలోని రూములను, మరి కొందరు ఫాంహౌజ్‌లను సెలబ్రేషన్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత డిసెంబరు 31 అర్థరాత్రి వరకు స్నేహితులతో కలిసి న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెల్‌కమ్ పలికేందుకు సిద్ధమయ్యారు. కొందరు వ్యవసాయ క్షేత్రాల్లో పార్టీలను ఏర్పాటు చేసుకొన్నారు. న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు.

శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా వేడుకలు నిర్వహించుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కమిషనరేట్‌లోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్, మఫ్టీ టీములు, ఎస్‌బీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. 12.30గంటలలోపు వేడుకలు ముగించాలన్నారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యకలాపాలకు అనుమతి తీసుకోవాలని, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదన్నారు. ఆర్కెస్ట్రా, డీజేలు, బాణాసంచా నిషేధమన్నారు. మంగళవారం రాత్రి 10గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం మత్తులో వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్లే వారిని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు.

చెన్నూరు/మందమర్రిటౌన్/కాసిపేట/ భీమారం /దండేపల్లి,(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెన్నూరు, మందమర్రి, తాండూరు సీఐలు రవీందర్, శశిధర్‌రెడ్డి, కుమార స్వామి, భీమారం, దండేపల్లి ఎస్ఐలు శ్వేత, ఉదయ్‌కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. డిజేలు, మైక్‌లకు అనుమతులు లేవన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, ఈలలు వే యడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామ న్నా రు.

మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైస్‌చైర్మన్ మహేష్, కమిషనర్ మారుతిప్రసాద్

గర్మిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వైస్ చైర్మన్ సల్ల మహేష్ అధ్యర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సాధారణ నిధులు రూ.71.28 లక్షలతో పలు అబివృద్ధి పనులు చేయడానికి పరిపాలన ఆమోదం తెలిపారు. వివిధ దినపత్రికల్లో ప్రచురించిన టెండరు ప్రకటన బిల్లులు రూ.1,31,000 మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించడానికి కౌన్సిల్‌లో ఆమోదించారు. కమిషనర్ మారుతిప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువు మృతిపై కుటుంబీకుల ఆందోళన

గర్మిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రిలో శిశువు మృతికి ఆసుపత్రి వైద్యుడే కారణమని కుటుంబీకులు సోమవారం ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పాత బెల్లంపల్లికి చెందిన గందం గంగవ్వ ప్రసూతి కోసం మంగళవారం నార్మల్ డెలివరీ కాగా ఆడ శిశువు జన్మించింది. పుట్టిన శిశువు ఆరోగ్యం సరిగ్గా లేక సమీపంలోని ఓ పిల్లల ఆసుపత్రిలో చేర్పించారు. పిల్లల వైద్యుడు నాలుగు రోజులు చికిత్స అందించి శనివారం డిశ్చార్జ్ చేశారు. ఆదివారం సాయంత్రం శిశువు తల్లి పాలు తాగకుండా పడుకుని ఉండడంతో కుటుంబీకులు పిల్లల ఆసుపత్రికి ఫోన్ చేయగా ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. కాగా ఆదివారం అర్ధరాత్రి శిశువు మృతిచెందింది. శిశువు వైద్యం కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేశామని, సరైన వైద్యం అందించకపోవడంతోనే శిశువు మృతి చెందిందంటూ సోమవారం మంచిర్యాల ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు బాధితులతో మాట్లాడి కేసు పెడితే దర్యాప్తు చేస్తామని చెప్పారు. శిశువు కుటుంబీకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. పిల్లల ఆసుపత్రి వైద్యుడిని వివరణ కోరగా శిశువు తక్కువ బరువుతో జన్మించిందని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని, మెరుగైన వైద్యం అందించామన్నారు. డిశ్చార్జ్ అయిన 48 గంటల తర్వాత వచ్చి తనపై నిరాధారమైన ఆరోపణలు చేసి ఆందోళన చేశారని, శిశువు మృతికి తాను కారణం కాదని వైద్యుడు సమాధానమిచ్చాడు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సురేష్ (ఫైల్)

తాండూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల కేంద్రానికి చెందిన ఇందారం సురేష్(32) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. సురేష్ మేక పిల్ల తప్పిపోయింది. ఆదివారం రాత్రి కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద వెతుకుతుండగా చీకట్లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో కరెంటు తీగ తగిలి షాక్‌తో స్రృహ కోల్పోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సురేష్‌ను చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం మృతిచెందాడు. సురేష్ ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పనిచేసేవాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

బైక్‌పై నుంచి కింద పడి సింగరేణి కార్మికుడి మృతి

చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దాల క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి చింతకింది రమేష్ (32) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. పట్టణంలోని గెర్రె కాలనీలో నివాసం ఉంటున్న రమేష్ శ్రీరాంపూర్‌లోని ఆర్కే5 గనిలో పనిచేస్తున్నాడు. గని వద్ద మైసమ్మకు చేస్తున్నారని భార్యతో చెప్పి ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడి నుంచి బీజోన్‌లో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం రహదారిపై వెళ్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. బైక్ ఆధారంగా వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

బైక్ ఇవ్వలేదని విద్యార్థి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బైక్ ఇవ్వలేదనే మనస్తాపంతో కొండిల్ల సాయిఅవినాష్(20) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు శ్రీనివాస్ కుమారుడు సాయిఅవినాష్ మందమర్రిలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్నాడు. శనివారం ఇంటికి వచ్చిన సాయి అవినాష్ రాత్రి బయటకు వెళ్తానని బైక్ కావాలని తండ్రిని అడిగాడు. రాత్రిపూట బైక్ వద్దని తండ్రి మందలించగా గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. సోమవారం ఉదయం చూడగా ఉరి వేసుకుని ఉండడంతో, వెంటనే సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వ్యాపారి మృతి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన శ్రీరామోజు రాజేశ్వర్‌రావు(55) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు.

ఆది నారాయణపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

బెల్లంపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరిజన్ డెయిరీ నిర్వాహకుడు ఆది నారాయణపై ఆదివారం రాత్రి దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పని నిమిత్తం బజార్ ఏరియాలో ఆదినారాయణ అతని స్నేహితుడు వెళ్తున్న సమయంలో పట్టణానికి చెందిన శ్యామ్, సతీష్‌లతోపాటు మరో ఆరుగురు దాడి చేశారన్నారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు


ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం రడగంబాల బస్తీలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 24 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలను సీజ్‌చేశారు. అనుమానాస్పద ప్రదేశాల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని తెలిపారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్‌ఐలు మహేందర్, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జన్నారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రేండ్లగూడ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని రేంజ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలించినా, అనుమతులు లేకుండా ఇసుక తీసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేత

శ్రీరాంపూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, చెన్నూర్ ప్రధాన రహదారి జీఎం కార్యాలయం వద్ద రహదారిపై గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం దాటిన తరువాత ఉన్న టర్నింగ్ నుంచి ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. తరచూ ప్రమాదాలు జరగడం కలిచివేసిందని, అందువల్లే గుంతలను పూడ్చివేయించామని పోలీసులు పేర్కొన్నారు. వాహనదారులు కూడా రాత్రివేళల్లో అతివేగంగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్కే 6 నుంచి ప్రధాన రహదారికి వచ్చే టర్నింగ్‌లో గమనించి ముందుకు వెళ్లాలని సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ పార్టీ

మందమర్రిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సీపీఐ పార్టీ అని పట్టణ కార్యదర్శి దుర్గరాజ్ పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పార్టీ వందేళ్ళ వేడుకలను నిర్వహించుకుంటున్నామన్నారు. సీపీఐ పార్టీ ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. నల్గొండలో జరిగిన సభకు తరలివెళ్లారు. బీమనాదుని సుదర్శన్, సలేంద్ర సత్యనారాయణ, బండారి రాజేశం, ప్రభాకర్, రసూల్, బానయ్య, దినేష్, రాజేశ్వర్‌రావు, రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం అందని భాగ్యమే..

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- క్షేత్రస్థాయిలో అరకొర సేవలు
- ఆదివాసీలను వెంటాడిన అంటువ్యాధులు.. రక్తహీనత



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ప్రజానికానికి ఆరోగ్యం ఇంకా అందని భాగ్యంగానే మిగిలిపోయింది. ఆసిఫాబాద్ ఏజెన్సీలో వైద్యపరంగా మౌళికవసతులు, సిబ్బంది నియమకాలు జరుగుతాయని ఆశించినా అది ఆచరణకు నోచుకోలేదు. ముఖ్యంగా ప్రతియేటా ఏజెన్సీని చుట్టుముట్టే అంటువ్యాధులు, విష జ్వరాలు షరామామూలుగా ఈ ఏడాది కూడా జిల్లాను పీడించాయి. జిల్లాలో గిరిజన మహిళలు రోగనిరోధక శక్తిని కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. ఫలితంగా ఎంతోమంది గర్భిణులు పురిటి సమస్యలను ఎదుర్కొంటూ ప్రసవవేదనకు గురవుతున్నారు. జిల్లాలోని 15మండలాల్లో మొత్తం రెండు సామాజిక ఆసుపత్రులు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 20ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 118 ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో 46మంది వైద్యులకు గాను కేవలం 20మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 26వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు,హెల్త్ సూపర్‌వైజర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్‌ఎం ఇతర సిబ్బంది మొత్తం 481పోస్టులకుగాను 336మంది పని చేస్తున్నారు. 145పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో జిల్లాలో వైద్యసిబ్బంది పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతిసీజన్‌లో అంటువ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొంటోంది. దీనికి తోడు జిల్లాలో 300కి పైగా గిరిజన గూడాలు అత్యంత సమస్యాత్మక ప్రాంతాలుగా ఉండడం, ఆయా గ్రామాలకు కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడం, ప్రతి యోటా వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడిచేరుకోవడం వైద్యసిబ్బందికి సవాలుగా మారింది.

పేరుకే పెద్దాసుపత్రి..

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లయినా సర్కారు దవాఖానాల్లో సరైనవైద్యం అందడంలేదు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని 300పడకలకు పెంచి మెడికల్ కళాశాలకు అనుసంధానంగా మార్చారు. నిత్యం వందల సంఖ్యలో ఇన్, అవుట్ పేషెంట్లు వస్తుంటారు. కానీ ఇక్కడ సరైనవైద్యం అండడంలేదు. స్థాయి పెంచినా ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ వైద్యులు, ఐదుగురు కాంట్రాక్టువైద్యులు విధులు నిర్వ హిస్తున్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టుతోపాటు స్పెషలిస్టు డాక్టర్లు లేక పోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడు తోంది. కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించినా వైద్యులు లేకపోవడంతో ఆరోగ్యం అందని ద్రాక్షలా మిగిలిపోతోంది. చిన్నచిన్న రోగాలకు తప్ప ఆసుపత్రిలో సరైనవైద్యం అందడంలేదు. ప్రతి కేసును ఇక్కడి వైద్యులు మంచిర్యాల, కరీంనగర్, వరంగల్‌కు రెఫర్ చేస్తున్నారు.

ఆర్థోపెడిక్ డాక్టర్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల ప్రతికేసును ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. దీంతో నిరుపేదలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడంతో రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వఆసుపత్రిలో తరచూ మందుల కొరత ఏర్పడటంతో రోగులు ప్రైవేటులోనే మందులు కొనుగోలు చేయా ల్సిన పరి స్థితులు ఉన్నాయి. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ ఉన్నా వైద్యులు లేక సర్జరీలు జరగడంలేదు. కొత్తగా ఏర్పడిన మెడికల్ కళాశా లలో వైద్యవిద్యను బోధించే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసి స్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యవిద్యార్థులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. 115 బోధన సిబ్బంది పోస్టులకు గాను కేవలం ఏడుగురే పనిచేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి.

ఉపాధ్యాయులు సమ్మెలో.. విద్యార్థులు బడిలో..


ఉపాధ్యాయులు లేకపోయినా చదువుకుంటున్న విద్యార్థులు

సిర్పూర్(టి), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు 22 రోజులుగా సమ్మె చేస్తుండడంతో గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థుల చదువులు అస్తవ్యస్తంగా మారాయి. ఉపాధ్యాయులు లేకపోయినా విద్యార్థులే పాఠశాలకు వచ్చి గతంలో చెప్పిన పాఠాలను రివిజన్ చేసుకుంటున్నారు.

పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థుల చదువుపై తీవ్రప్రభావం పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి విద్యార్థుల చదువులు గట్టెక్కేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న ఎఫ్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌పట్టణంలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కార్తీక్,రక్షిత, ఝాన్సీరాణి, టీనా, శ్రీహర్షిత, తేజస్విని, అనూష, శృతి, వైభవ్ పాల్గొన్నారు.

ఏవీఎస్పీ రాష్ట్ర కన్వీనర్‌గా ఆడ నర్సింగ్‌రావు

సిర్పూర్(యు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేట్నూర్ గ్రామానికి చెందిన ఆడ నర్సింగ్‌రావు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘం ఆదివాసీ విద్యార్థిసంక్షేమపరిషత్ (ఏవీఎస్పీ) రాష్ట్రకన్వీనర్‌గా ఎన్నికయ్యాడు. ఇటీవల హన్మకొండలో ఆదివాసీ సంక్షేమపరిషత్ అనుబంధ సంఘాల రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ నర్సింగ్‌రావు ఫోన్‌లో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏవీఎస్పి రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకునందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏజెన్సీ చట్టాల పకడ్బందీ అమలు కోసం తమ సంఘం తరపున కృషి చేస్తామన్నారు. ఆదివాసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. పెసాతోపాటు 1/70 చట్టాలు పకడ్బందీగా అమలయ్యేలా ప్రతిఒకరు కృషి చేయాలన్నారు. ఆడ నర్సింగ్‌రావు ఎన్నికపై మండల ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

బెజ్జూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్వే నం.760లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని సోమవారం మండలానికి చెందిన దేవాజీ, షణ్ముఖ, సల్మాన్, మల్లేష్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వస్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగితే రాబోయేరోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కొరత ఏర్పడుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపటి నుంచి ఆపరేషన్ స్మైల్

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనవరి1నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తామని ఉమెన్‌సేఫ్టీ వింగ్ డీఐజీ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉమెన్‌సేఫ్టీ వింగ్ డీఐజీ వీడియో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్ ఆధ్వర్యంలో డీసీఆర్‌డీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ ఆపరేషన్ స్మైల్ సభ్యులు పాల్గొన్నారు. ఆపరేషన్‌స్మైల్ కార్యక్రమం నిమిత్తం పోలీసు అధికారుల నుంచి ఎస్సైస్థాయి అధికారిని ఈడివిజన్లకు ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ప్రతిడివిజన్‌సభ్యులలో పోలీసు,పంచాయతీరాజ్, మహిళాఅభివృద్ధి, శిశుసంక్షేమ, కార్మిక, విద్య, ఆరోగ్య, చైల్డ్‌ప్రొటెక్షన్ యూనిట్, ఎన్జీవో సంస్థల నుంచి సభ్యులు ఉండేలాగా రెండుటీంలు ఏర్పాటుచేశామని డీఐజీ తెలిపారు. ఆపరేషన్‌స్మైల్ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, బాలకార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను రక్షించడం, వారికి పునరావాసం కల్పిస్తారన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, ఇతరప్రదేశాలను సందర్శించి బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించేందుకు చర్యలు చేపడుతా రన్నారు.

పెద్దపులి సంచారం.. భయాందోళనలో ప్రజలు

బెజ్జూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సులుగుపల్లి అటవీప్రాంతపరిధిలో పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం జైహింద్‌పూర్ నుంచి సులుగుపల్లి అటవీప్రాంతం వైపు పులిపాదముద్రలు కనిపించాయని సులుగుపల్లి సెక్షన్ అధికారి మల్లికార్జున్ తెలిపారు. ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా గుంపులుగా వెళ్లాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మానం

బెజ్జూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేసిఇటీవల పదవీవిరమణ పొందిన భారతమ్మ, వసుమతిని సీడీపీవో విజయలక్ష్మి, అంగన్‌వాడీకార్యకర్తలు సోమవారం సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేసి గ్రామంలో మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీభూమి సాగుచేసిన వ్యక్తికి 14రోజుల రిమాండ్

చింతలమానేపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం దిందాగ్రామానికి చెందిన ఆత్రంభీంరావు అనేవ్యక్తి అటవీ భూమిని సాగు చేశాడు. ఈ క్రమంలో చెట్లను నరికివేయగా అటవీశాఖ సిబ్బంది పరిశీలించి భీంరావుపై కేసు నమోదుచేసి సిర్పూర్(టి) జూనియర్ సివిల్‌జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జడ్జి భీంరావుకు 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఎస్‌వో మోహన్ తెలిపారు. అటవీ భూమిలో ఎవరు సాగు చేసినా, చెట్లను నరికినా చట్టప్రకారం చర్యలు తీసు కుంటామన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి 21వరోజుకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు శృతిక, తుకారాం, నాగసుధ, రమణ, నాగేష్, సంతోష్, పవన్‌కుమార్, సందీప్, నలంద, అరుణ, మీనా, కవిత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు పండ్లు పంపిణీ

చింతలమానేపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లిమండలం నుంచి చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్ మీదుగా మహారాష్ట్రలోని చప్రాడ దేవస్థానానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు రవీంద్రనగర్ గ్రామంలో నాయకులు పండ్లు పంపిణీ చేసి తేనీటివిందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, వెంకయ్య, నవీన్, సాయి, చందు, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సిర్పూర్(టి), డిసెంబరు 30(ఆంధ్ర జ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్, పారిగాం, టోంకిని గ్రామాల్లో కొన సాగుతున్నసర్వేను ఎంపీడీవో సత్యనారా యణ పరిశీలించారు. సర్వేనువేగంగా చేపట్టాలని, త్వరగా పూర్తి చేయాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సిర్పూర్(టి), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం నుంచి కరీంనగర్‌కు మూడువ్యాన్లలో నిబంధనలకు విరుద్ధంగా సోమవారం అక్రమంగా తరలిస్తున్న 18పశువులను ఎస్సై ఎం కమలాకర్ పట్టుకున్నారు. ఈ మేరకు మూడు వ్యాన్లను సీజ్‌చేసి 9మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు. పశువులను గోశాలకు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వృత్తిశిక్షణ కేంద్రంలో పొందే శిక్షణను గనుల్లోసద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కేబాజీసైదా, సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఎంవీటీసీని సోమవారం వారు సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, ఇటీవల ఉద్యోగాలు పొందిన వారికి కంపెనీలో ఉజ్వల భవిష్యత్తు ఉందని, విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. సంక్రమంగా పనిచేసుకొని కుటుంబం, సంస్థఅభివృద్ధికి పాటుపడాలని అన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి టౌన్, డిసెంబరు 30(ఆంధ్ర జ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీగార్డుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవచూపాలని సీఐటీయూ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటుసెక్యూరిటీ గార్డులందరికీ డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, పనిప్రదేశాల్లో సేఫ్టీపరికరాలను అందజేయాలన్నారు. కాంట్రాక్టర్లు అనుసరిస్తున్న విధానాల వల్ల సెక్యూరిటీగార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చలిఅధికంగా ఉన్నందున స్వెటర్లు ఇవ్వాలని అన్నారు.

హెచ్‌ఎంఎస్ పిట్ సెక్రెటరీగా వలీ


ఎస్‌కే వలీ

జైపూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇందారం ఓసీపీ హెచ్‌ఎంఎస్ పిట్ సెక్రెటరీగా ఎస్‌కే వలీ నియమితులయ్యారు. హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు ఏరియా వైస్‌ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి సోమవారం ఎస్‌కే వలీకి నియామకపత్రం అందజేశారు. ఎస్‌కే వలీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవీ ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని, హెచ్‌ఎంఎస్ బలోపేతానికి తోడ్పడతానన్నారు.

టీబీజీకేఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పవన్ కళ్యాణ్


పవన్ కళ్యాణ్

శ్రీరాంపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ఎస్‌ఆర్పీ3,3ఏ గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు పవన్‌కళ్యాణ్ నియమితుడయ్యాడు. ఈ మేరకు ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఒకప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు పవన్‌కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.

హస్తం హవా

3వ పేజీ తరువాయి

గిరిజన కోటాలో పదవి ఇవ్వాల్సి వస్తే వెడ్మ బొజ్జును మంత్రి పదవి వరించే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగనుందనే ప్రచారంతో జిల్లాలోని ఎమ్మెల్యేలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వారంతా ఢిల్లీ చుట్టూ తరుచుగా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రేంసాగర్‌రావుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి స్పష్టమైన హామీ ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నస్పూర్‌లో ఏర్పాటు చేసి న కాంగ్రెస్ బహిరంగ సభలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ప్రేంసాగర్‌రావుకు మంత్రి ఇవ్వనున్నట్లు ఖర్గే ప్రకటించారు. అలాగే గడ్డం సోద రులకు సైతం ఢిల్లీలోని పార్టీ అగ్రనేతలతో సత్సంబంధాలు ఉన్నాయి. వీరు మంత్రి పదవి దక్కించుకునేందుకు తమ తండ్రికి ఢిల్లీలో ఉన్న పలు కుబడిని ఉపయోగిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిపత్యం కోసం....

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి కాంగ్రెస్‌తోపాటు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పట్టు బిగించే ప్రయత్నాలు చేస్తున్నాయి. స్థానిక సంస్థలను కైవసం చేసుకోవడం ద్వారా తమ ఉనికిని చాటుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌లు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయి. మంచిర్యాల నియోజక వర్గ ఎమ్మెల్యేగా ప్రేంసాగర్‌రావు గెలవగానే మొదట మున్సిపాలిటీలపై దృష్టిసారించారు. మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో అప్పటి వరకు పాలన సాగించిన బీఆర్ఎస్ ఛైర్మన్లపై అవిశ్వాసానికి తెరలేపారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మంచిర్యాల మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న పెంట రాజయ్య, వైస్ ఛైర్మన్‌గా ఉన్న గాజుల ముకేష్ గౌడ్, నస్పూర్ ఛైర్మన్‌గా ఉన్న ఈసంపెల్లి ప్రభాకర్, వైస్ ఛైర్మన్‌గా ఉన్న తోట శ్రీనివాస్‌లు పదవీచ్యుతులు అయ్యారు. వారి స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఛైర్మన్‌గా రావుల ఉప్పలయ్య, వైస్ ఛైర్మన్‌గా నల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ ఛైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ ఛైర్‌ప ర్సన్‌గా గెల్లి రజితలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా లక్షెట్టిపేట మున్సిపాలిటీలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం అక్కడి బీఆర్ఎస్ ఛైర్మన్ నల్మాసు కాంతయ్య ముందస్తు ప్రణాళికలతో వీగిపోయింది. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయబావుటా ఎగుర వేసేం దుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉండగా, బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా తవ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామంలోని బ్యాంకు ఏరియాలో నెల రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో చెన్నూరు- మంచిర్యాల ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. నెల రోజుల క్రితం బోరు మోటారు కాలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నెల రోజులుగా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీటి కష్టాలు తీర్చాలని కోరారు.

బెల్లంపల్లిలో ఐటీ కంపెనీ ఏర్పాటు గొప్ప విషయం



ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్‌రంజన్

బెల్లంపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో సనాతన ఐటీ కంపెనీ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పేర్కొన్నారు.ఆదివారం రాత్రి హైద్రాబాద్‌లో కంపెనీ వార్షిక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను సత్కరించారు. కంపెనీ డైరెక్టర్‌లు శ్రీరంగనాధరాజు, శ్రీనాథ్‌రాజు, సాయినాథరాజు, హారిక, కీర్తన, సాహితి పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

తాండూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పశువైద్య సిబ్బంది దుర్గం కళ్యాణ్, అన్నం మల్లేష్, సాయి, చంద్రదాసు, రాధికలు సోమవారం పశుగణన చేపట్టారు. మార్చి 31 వరకు కొనసాగుతుందని మండల పశువైద్యాధికారి నరసింహారావు తెలిపారు.

కాలువలకు గండ్లు..
పూడ్చేదెప్పుడు..?



రాంపూర్ కుడి కాలువకు మరమ్మతు చేస్తున్న రైతులు (ఫైల్)

- కమలాపూర్, రాంపూర్ ప్రాజెక్ట్ కాల్వలకు గండ్లు
- బీళ్లుగా మారుతున్న భూములు
- అవస్థలు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

భీమిని, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్, రాంపూర్ ప్రాజెక్టు కాల్వలకు గండ్లు పడ్డాయి. ప్రాజెక్టుల ఎడుమ, కుడి కాలువలకు గండ్లుపడ్డాయి. కాలువలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఆయకట్టుకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2004లో కమలాపూర్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. దీనిద్వారా సుమారు 4వేల ఎకరాలకు సాగు నీరందించాలని నిర్ణయించారు. కానీ కాల్వలకు గండ్లు పడడంతో వేయి ఎకరానికి కూడా నీరందని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలకు ఎడమ, కుడి కాలువలకు గండ్లు పడ్డాయి. ఈయేడు కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ పూర్తిగా నిండి జలకళను సంతరించుకొంది. అయినప్పటికీ పంటలకు నీరందక వృథాగా పోయాయి. సాగు నీరందక రైతులు నష్టపోయారు.



మల్లీడి వద్ద రాంపూర్ కుడి కాలువకు గండి

శ్రమదానంతోనే మరమ్మతు

కాల్వలకు గండ్లు పడటంతో రైతులు గతంలో శ్రమదానంతో పూడ్చుకున్నారు. ఈ యేడు కూడా కాల్వల్లో గడ్డి, మట్టి పేరుకుపోయింది. గండ్లు పడిన చోట అధికారులు మరమ్మతు చేపట్టడంలేదు. శాశ్వత మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రాంపూర్ ప్రాజెక్టు...

రాంపూర్ ఎడుమ, కుడి కాలువలు పలు చోట్ల గండ్లు పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బిట్టూరుపల్లి, మల్లీడి గ్రామాల వద్ద కాల్వలకు గండ్లు పడుతున్నాయి. అధికారులు శాశ్వత మరమ్మతు చేపట్టకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాల్వలకు మరమ్మతు చేపట్టి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఖర్జీభీంపూర్ కొత్త చెరువు మత్తడి....

ఖర్జీభీంపూర్ కొత్త చెరువు కింద సుమారు 200 ఎకరాలు ఆయకట్టు ఉంది. కొత్త చెరువు మత్తడికి గండిపడి నీరు వృథాగా పోతోంది. గతేడాది మత్తడికి గండి పడటంతో ఆయకట్టు రైతులు స్వంత ఖర్చులతో ఇసుక బస్తాలతో లీకేజీలకు అడ్డుగా వేసి పంటలను పండించుకున్నారు. ఈ యేడు మత్తడి కిందిభాగం కోతకు గురై నీరు వృథాగా పోయిందని రైతులు వాపోయారు. గండి పడిన విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కాలువలు అధ్వానంగా తయారయ్యాయి



కాల్వలు పూడికతో నిండుకున్నాయి. కాల్వ పొడవునా పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో పొలాలకు నీరు అందడంలేదు. యేటా కాల్వలకు గండ్లు పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పొలాలకు నీరు పెట్టేందుకు కష్టాలు పడుతున్నాం. కాల్వలకు మరమ్మతు చేసి పూడికను తొలగించాలి.

- జక్కుల తిరుపతి గౌడ్, బాట్టూరుపల్లి, రైతు

మరమ్మతు చేపట్టాలి...



ప్రాజెక్ట్ కాల్వలకు మరమ్మతు చేపట్టాలి. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదు. త్వరగా మరమ్మతు చేపడితే రైతులకు మేలు జరుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలువ మరమ్మతులకు కృషిచేయాలి.

- పోతురాజుల శ్రీకాంత్, లక్ష్మీపూర్, రైతు

మత్తడికి మరమ్మతు చేయాలి...



ఖర్జీభీంపూర్ కొత్త చెరువు మత్తడి పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలి. మత్తడి శిథిలం కావడంతో నీరు వృథాగా పోవడంతో పంటలు పండటం లేదు. మరమ్మతు చేపట్టి సాగునీరు అందేలా చూడాలి.

- ఠాకూర్ ఉదయ్ సింగ్, ఖర్జీభీంపూర్, రైతు

న్యూస్ బాక్స్

ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా అంజన్న



మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దండేపల్లి మండలానికి చెందిన జెల్లపెల్లి అంజన్న నియమితులయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర సభల్లో రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అంజన్నను నియమించారు.

ఎన్ఎస్ఎఫ్ మండల కన్వీనర్‌గా ఈశ్వర్



జన్నారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నల్లూరి ఈశ్వర్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్ఎస్ఎఫ్‌ను బలోపేతం చేస్తానని ఈశ్వర్ తెలిపారు.

పాత వాహనాల వేలం

మంచిర్యాల క్రైం, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాల పాత స్పేర్ పార్ట్‌లు, టైర్లు, బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజన్ ఆయిల్‌ను జనవరి 3న కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు అడిషనల్ డీసీపీ (అడ్మిన్)సీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాకు చెందిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఎంటీఓ సంపత్ 87126566162 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం

హాజీపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మారం గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో మంజూరైన లబ్ధిదారుల ఇండ్లలో సోమవారం ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్‌షరీఫ్‌లు మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 19 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, ఒక్కో దానికి రూ.12 వేలు ఎస్‌బీఎం స్కీం కింద అందిస్తామన్నారు. ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): నాగసముద్రం గ్రామ చెరు వు భూమి సర్వే నెంబర్15, 16లో భూమిని కొందరు కబ్జా చేశారని, కాపాడాలని గ్రామస్థులు తహసీల్దార్ సంధ్యరాణికి వినతిపత్రాన్ని అందజేశారు. మూడేళ్ల క్రితం మట్టి పోసి భూమి కబ్జా చేశారన్నారు. దాని పక్క ఉన్న 17 సర్వేలో చెరువు భూమిలో ఫుల్ ట్యాంక్ లేవల్ చూపుతున్నారని పేర్కొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జోష్నకు ఎంసీపీ ఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహా య కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు వినతిపత్రం అందించారు. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించిన భూముల్లో మట్టి తరలిస్తున్నారన్నారు. మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలో మీసేవ కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఐబీలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): రాముని చెరువు కట్టపై అక్రమార్కులు చేస్తున్న కబ్జా ప్రయత్నాలను అడ్డుకోవాలని స్వచ్ఛంద పౌర సేవా సంస్థ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు కట్ట స్థలాన్ని హైటెక్ సిటీ, జాఫర్‌నగర్ వైపు అక్రమార్కులు కబ్జా చేసి రోడ్లు, భవనాలు నిర్మిస్తున్నారన్నారు. వాకింగ్ ట్రాక్‌ను బాగు చేయాలన్నారు. మల్లయ్య, మధుసూదన్, రాజేశం, ప్రదీప్‌కుమార్, రాధేశ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీ కార్మికుల 12 నెలల బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేక ల దాసు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సమ స్యలు పరిష్కరించాలని హమాలీ కార్మికులు జనవరి 1 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలో కుమరంభీం విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిం చాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిం చారు. జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్, మండల అధ్యక్షుడు జైలు, వెంకటేష్, మాంతయ్య పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): రానున్న సర్పంచు ఎన్ని కల్లో భీమారం మేజర్ పంచాయతీ రిజర్వేషన్ బీసీలకే కేటాయించాలని బహుజన నాయకులు వినతిపత్రం అం దించారు. 1996లో బీసీ జనరల్ వచ్చిందని తెలిపారు. బీసీ కులాలు గ్రామ జనాభాలో 56 శాతం నుంచి 64 శాతం వరకు ఉన్నాయని తెలిపారు.

అంబేద్కర్ క్రికెట్ టోర్నీ విజేత భీమారం

నెన్నెల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యూత్ ఆధ్వర్యంలో కొత్తూరులో నిర్వహించిన అంబేద్కర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భీమారం జట్టు విజేతగా నిలిచింది. వారం రోజులు కొనసాగిన టోర్నమెంట్‌లో వివిధ మండలాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో నెన్నెల మండలం దుబ్బపల్లి జట్టును ఓడించి భీమారం జట్టు చాంపియన్‌షిప్ దక్కించుకుంది. విజేత జట్టుకు రూ.20 వేలు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. 15 వేల నగదు జ్ఞాపికలు అందజేశారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు. నిర్వాహకులు కొడిపె మహేందర్, ప్రవీణ్, బోయిని అరుణ్, మడ గోపాల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

హాజీపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడిపేటలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థి అజయ్‌కుమార్ జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, కార్యదర్శి ఆవునూరి మహేష్‌లు తెలిపారు. జనవరి 1 నుంచి 3 వరకు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో అజయ్‌కుమార్ పాల్గొనున్నట్లు తెలిపారు. అజయ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ శ్రీధర్, పీడీ సురేష్, పీఈటీలు, నగేష్ అభినందించారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోటపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మోడల్ స్కూల్, కళాశాలలో పదో తరగతి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశారు. పూర్తయిన సిలబస్, ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించవద్దు

దండేపల్లి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): పౌర హక్కులకు ఎవరూ భంగం కలిగించవద్దని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా సభ్యుడు బచ్చల అంజన్న అన్నారు. లక్ష్మీకాంతపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్ఐ భూమన్న, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ గోపాల్, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి):అందుగులపేటలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ పద్మజ, వెంకటేష్ పాల్గొన్నారు.



గ్రీటింగ్.. చీటింగ్..

- కొత్త సంవత్సరం.. విషెస్‌పై అప్రమత్తత అవసరం
- ఫేక్ లింకులు ఓపెన్ చేస్తే అంతే సంగతులు
- ఒక్క క్లిక్‌తో ఖాతాలో డబ్బులు మాయం
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసుల

బెజ్జూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్కడ చూసినా అరచేతిలో సెల్‌ఫోన్. అది లేనిదే నిద్ర, తిండి కూడా ఉండదంటే నమ్మశక్యం కాదు. సెల్‌తోనే కాలక్షేపం.. ఎవరికైనా డబ్బులు పంపించాలన్నా మొబైల్ ద్వారానే పంపిస్తున్నారు. సెల్‌ఫోన్‌తో ఎంత భద్రంగా ఉన్నా ఏదో ఒకరకంగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఖాతాలోని డబ్బులు మాయం అవుతున్నాయి. సాంకేతికత ఎంత పెరుగుతోందో మోసాలు కూడా అదేస్థాయిలో ఎక్కువవుతున్నాయి. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో బ్యాంకింగ్‌సేవలు సులువయ్యాయి. దాంతో క్షణాల్లో నగదు లావాదేవీలు సాగుతున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌పై సంపూర్ణ అవగాహన ఉన్నవారు అతికొద్ది మందైతే.. పెద్దగా పరిజ్ఞానం లేనివారే చాలా మంది ఉన్నారు. ఇలాంటి వారినే సైబర్ నేరస్థులు లక్ష్యంగా చేసుకొని బురిడీ కొట్టిస్తూ నగదును కాజేస్తున్నారు. ఈతరహాలో మోసపోతున్న వారిసంఖ్య రోజురోజుకు ఎక్కువ అవుతోంది. ఖాతాదారులకు అధికారులు, పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మోసగాళ్లు అదేస్థాయిలో రెచ్చిపోతూ కొత్తకొత్త మోసాలకు పాల్పడుతున్నారు. కాగా మరికొద్ది గంటల్లో రాబోతున్న నూతన సంవత్సరానికి వెల్కమ్ చెప్పేవాళ్లు సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. న్యూఇయర్ విషెస్ పేరిట మొబైల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా సందేశాల లింక్‌లు పంపిస్తున్నారు. అయితే గుర్తుతెలియని నెంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను ఏ మాత్రం క్లిక్ చేసినా మీ అకౌంట్లలో నగదును క్షణాల్లో మాయం చేస్తారని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్మార్ట్ ఫోన్ వినియోగించే వారంతా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

● ఏం చేస్తారంటే..

మరికొద్ది గంటల్లో కొత్త సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాం. ఈ రోజు అర్ధరాత్రి నుంచే విషెస్ హంగామా మొదలవుతుంది. బంధువులకు, శ్రేయోభిలాషులకు ఒకరికొకరు ఒక్కో విధంగా శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రణాళికలు చేసుకుంటారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూ మొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు, సందేశాలతో మెసేజ్‌లు పంపుతారు. అయితే ఇదే అదునుగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు ఇక్కడే రంగంలోకి దిగుతారు. మీకు నచ్చే విధంగా మీ పేరుతో గ్రీటింగ్ సందేశాలను పంపుకోవచ్చని చెబుతూనే మీరు చేయాల్సిందల్లా ఈ కింద లింక్‌పై క్లిక్‌చేసి వివరాలు నమోదు చేస్తే చాలని అంటారు. మన మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్‌లకు ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపుతారు. పొరపాటున లింక్ ఓపెన్ చేస్తే అంతేసంగతులు. మన ఫోన్‌లోని సమాచారమంతా సైబర్ నేరగాళ్లకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, డాక్యుమెంట్ ఫైళ్లు సైతం వారికి చేరిపోతాయి.

● అప్రమత్తతే రక్ష..

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. ఫోన్‌లోని సెట్టింగ్ ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కావు. మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు. తెలియని ఫైల్, మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయితే ఫోన్‌లో రీసెట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈ మెయిల్స్, టెక్స్, ఇతర సోషల్ మీడియా యాప్‌ల ద్వారా నకిలీ లింక్స్‌ను గుర్తించాలి. వాటిపై క్లిక్ చేయరాదు. మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్, ప్రోగ్రామ్స్, అధికారిక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలి. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు మార్పులు చేస్తుంటాయి.

లింక్‌లపై జాగ్రత్తగా ఉండాలి..
- ప్రవీణ్‌కుమార్, ఎస్సై, బెజ్జూరు



అపరిచిత వ్యక్తులు పంపే ఫైళ్లను, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయరాదు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు హాక్ చేస్తారు. న్యూ ఇయర్ విషెస్ చెప్పాలనుకునేవారు ఫోన్ ద్వారా మాట కలపడం, సందేశాన్ని పంపడం, వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవడం మంచిది. సైబర్ నేరగాళ్ల వలలోపడి మోసపోవద్దు. ప్రజలు వీటిపై అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో 1930నంబరును సంప్రదించాలి

డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆసిఫాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగిన కేసుల ప్రస్తుత స్థితిగతులపై, గ్రేవ్ కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు జరుగుతున్న తీరును ఎస్పీ డీఎస్పీ కరుణాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, ఇతర గ్రేవ్‌కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. నేరాల కట్టడి కోసం అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. అంతకుముందు ఎస్పీకి డీఎస్పీ బొకెను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐలు రవీందర్, బుద్ధే స్వామి, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ ఎం డేవిడ్


అదనపుకలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరి ష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అద నపుకలెక్టర్ ఎం డేవిడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతోకలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామంలో గిరిజనప్రాథమిక పాఠశాల భవనంలేక తరగతులు గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగించాల్సి వస్తోందని శాశ్వత పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్థులు, విద్యార్థులు దరఖాస్తులు అందజేశారు. వాంకిడి మండలంలోని పాట గూడ పంచాయతీపరిధిలో గల ఎనోలి, కొలాంగూడ గ్రామాలకు మిషన్‌భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని గ్రామస్థులు దరఖాస్తు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మహిళా ఉపాధి హామీ కూలీలు తమకు ఉపాధిహామీ పనులు కల్పించాలని దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం మర్తిడి గ్రామానికి చెందిన యశోద తనకు ఒంటరి మహిళా పింఛన్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. వాంకిడిమండలం లెండిగూడ గ్రామానికిచెందిన శ్యాంరావు తనకూతురుకు మతిస్థిమితం లేదని ఆసరాపెన్షన్ ఇప్పించాలని, రెబ్బెన మండలం గోలేటికి చెందిన గోలేటి రిజర్వాయర్ ఎడమకాలువ ఆయకట్టు రైతులు ఎమడ కాలువకు గండిపడినందున వెంటనే మరమ్మతులు చేయించి నీరుఅందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామపరిధిలోని పర్ధాన్‌గూడకుచెందిన విజయ్ తనకు ఉపాధికల్పించాలని అర్జీసమర్పించారు. ఆసిఫాబాద్‌పట్టణంలోని బజార్‌వాడీ గ్రామానికిచెందిన ప్రమీల తనకు ఇందిరమ్మఇల్లు, గృహజ్యోతి పథకం వర్తించేలా చేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం మహగాం గ్రామానికిచెందిన చిన్నమారు తాను సంవత్సరాలుగా ప్రభుత్వభూమిలో సాగుచేసుకుంటున్నాని తనకు నూతనపాసు పుస్తకం ఇప్పించాలని, సిర్పూర్(టి)మండలం పారిగాం గ్రామానికి చెందిన రావూజీవృద్ధాప్యపెన్షన్ మంజూరుచేయాలని దరఖాస్తు అందజేశారు.

సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతనసంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు31న జిల్లా వ్యాప్తంగా విస్తృతతనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా పరిధిలోని స్థానికపోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీంలతో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. అర్ధరాత్రి 12.30 గంటలలోపు వేడుకలు ముగించాలన్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే డయల్100కు సమాచారం అందించాలన్నారు. 2025సంవత్సరంలో ప్రజలందరికీ మంచికలగాలని ఆశిస్తూ జిల్లా ప్రజలకు, పోలీసు శాఖ తరపున నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు విద్యాశాఖ ఆర్జేడీ, డీఈవోలు జారీచేసిన షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ పీఆర్టీయూ, ఎస్టీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లాఅధ్యక్షుడు తుకారాం మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపడుతున్న సమ్మె కారణంగా 20రోజులుగా ఎమ్మార్సీ కార్యాలయంలోని పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కారణంగా ఎంఈవోలకు షోకాజు నోటీసులు జారీచేయడం సరికాదన్నారు. వెంటనే ఎంఈవోలకు జారీచేసిన షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు సుభాష్, సంజీవ్, మానిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో గాలిపటాలు ఎగురవేయడం కోసం చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ ఒక ప్రకనటలో పేర్కొ న్నారు. అటవీశాఖాధికారులు రానున్న రోజుల్లో దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని ఒకవేళ నిషేధిత మాంజ కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు పక్షులకు ఇబ్బంది కలిగించే చైనా మాంజా అమ్మకూడ దని, అధికారులకు సహకరించాలని కోరారు

సమ్మె నోటీసులు అందజేత

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెరిగిన సివిల్ సప్లయి హమాలీరేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయ కుంటే జనవరి1నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు తెలిపారు. హమాలీలు నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వామపక్షాల నిరసన

ఆసిఫాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించపరిచే విధంగా కేంద్రమంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరును నిరసిస్తూ వామపక్షాల నాయకులు సోమవారం అంబేద్కర్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు దినకర్, కార్తీక్, రాజేందర్, ఆనంద్‌కుమార్, టీకానంద్, కృష్ణమాచారి, తిరుపతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతన దరఖాస్తుల ప్రతులను సమర్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 2017-18 నుంచి 2024-25వరకు జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు యూని వర్సిటీ, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తులను జనవరి20లోగా జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

● రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎండీ గౌతమ్


వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్

ఆసిఫాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లసర్వే ప్రక్రియను సమర్థవంతంగా న్విహించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియలో సేకరించిన వివరాలు యాప్‌లో నమోదు చేయడం, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిందన్నారు.

ఈ క్రమంలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్లసర్వేను సమర్థవంతంగా నిర్వహిం చాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపుకలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లసర్వే పకడ్బందీగా కొనసాగుతోందని తెలిపారు. సర్వే సిబ్బంది ప్రతిఇంటికి వెళ్లి దరఖాస్తుదారుల ఫొటోలు, ఇంటి యజమానుల వివరాలు సేకరించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు.

ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సేకరించిన వివరాలను స్పష్టంగా నమోదుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ ఎం డేవిడ్, మున్సిపల్ మున్సిపల్ కమిషనర్‌లు భుజంగరావు, అంజయ్య, హౌజింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్


ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):ఆసిఫాబాద్ ఏఎస్పీగా చిత్తరంజన్‌ను నియమిస్తూ సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీచేశారు. ఐపీఎస్-2022 బ్యాచ్‌కు చెందిన చిత్తరంజన్ గ్రేహౌండ్స్ ఏఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయనను ఆసిఫాబాద్ డీఎస్పీ స్థానానికి కేటాయించారు. ఆసిఫాబాద్ డీఎస్పీగా పనిచేస్తున్న కరుణాకర్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

దహెగాం/సిర్పూర్(టి), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో నూతనసంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్సైలు రాజు, కమలాకర్ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న డ్రంకెన్‌డ్రైవ్, వాహనాలతనిఖీ నిర్వహిస్తామన్నారు. డీజే పాటలు, డ్యాన్సులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒంటిగంటలోపు నూతన సంవత్సర వేడుకలను ముగించాలన్నారు.

భీమయ్యక్ స్వామి జాతర పోస్టర్ల విడుదల


ఆసిఫాబాద్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం పాట్నాపూర్‌లోని వంగెపురి ఓంరాజ్ భీమయ్యక్ స్వామి ఆలయ ప్రాంగణంలో జనవరి2నుంచి 4వరకు నిర్వహించే జాతరపోస్టర్లను సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్ నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్ము, గంగారాం, రాజు, భీంరావు, మాదవ్‌రావు, చిన్ను,చిన్నభీము తదితరులు పాల్గొన్నారు.

దంతనపల్లిలో జనవరి 9నుంచి జాతర..

జైనూర్: ఆదివాసుల ఆరాధ్యదైవం భీమయ్యక్ దేవత జాతర పోస్టర్లను మండలకేంద్రంలో సోమవారం ఆదివాసీ నాయకులు విడుదల చేశారు. కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రంరాజు మాట్లాడుతూ జనవరి9,10,11తేదీల్లో తిర్యాణి మండలంలోని దంతనపెల్లి అటవీప్రాంతంలో భీమయ్యక్ దేవత జాతర జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో కొలాం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆత్రం షేకురావ్, నాయకులు ఆత్రం లక్ష్మణ్, ఆత్రం భీంరావ్, ఆత్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

కాగజ్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈసుగాం మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో సోమవారం ఏఎస్సై హీరామన్ విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్‌నేరాలు, గంజాయి, ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కళాజాతా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో జ్ఞానం

జైనూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో జ్ఞానోదయం ప్రాప్తమవుతుందని పూలాజీబాబ తనయుడు ఇంగ్లే కేశవ్‌రావ్ అన్నారు. మండలంలోని గూడామామడ పరిధిలోగల హనుమాన్‌గూడలో పూలాజీబాబా 21వవార్షికోత్సవ కార్యక్రమంలోఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా కుటుంబంలో చిన్నారు లను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, దైనందీన జీవనంలో ఒకరినొకరు పరస్పరసహకారం అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్ధేశ్వర్‌సంస్థాన్ పాట్నాపూర్ శాఖ హనుమాన్‌గూడ అధ్యక్షుడు కాంబ్లె సైనాజీ, అంద్‌సమాజం జిల్లా అధ్యక్షుడు గారులె నారాయణ, గ్రామపటేల్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● డీపీఎం సారయ్య


పిండిగిర్నిని ప్రారంభిస్తున్న డీపీఎం సారయ్య

వాంకిడి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయకసంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఎం సారయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘం సభ్యురాలికి ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకంకింద పిండిగిర్నీ మంజూరు కాగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈపథకంద్వారా మహిళాసంఘం సభ్యులకు రూ.2,16,000రుణం బ్యాంకుద్వారా లభిస్తుందన్నారు. ఈ పథకంలో 35శాతం లబ్ధిదారులకు సబ్సిడీ వస్తుందన్నారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నందకిశోర్, ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, ఏపీఎం మహేష్, సీసీ విఠల్, వేణుగోపాల్, భీంరావు, సునీత, కవిత, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.